క్లుప్తంగా

హాలు నిర్మాణానికి నిధులు మంజూరు



కాలనీవాసులకు ప్రొసీడింగ్ పత్రాలను అందిస్తున్న జంగయ్య

ఆమనగల్లు: కమ్యూనిటీహాలు నిర్మాణానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నిధులు మంజూరు చేయించారని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని నవచైతన్య కాలనీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కమ్యూనిటీహాలుకు మంజూరైన రూ.10లక్షల ఉత్తర్వులను వస్పుల జంగయ్య నవచైతన్య కాలనీవాసులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జంతుక జానయ్య, పులికంటి మైసయ్య, బల్‌రాం, శంకర్, కిరణ్, బాలకృష్ణ, వగ్గు మహేశ్, సురేశ్, శ్రీను, రాజు, శివ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చల్లంపల్లిలో అయిల్ పామ్ ప్లాంటేషన్

కడ్తాల్: మండల పరిధిలోని చల్లంపల్లిలో బుధవారం ఉదయం 11 గంటలకు అయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల ఉద్యాన శాఖ అధికారి సౌమ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతున్నట్లు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

తలకొండపల్లి: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని దేవుని పడకల్‌లో ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేష్, డాక్టర్ అఖిల్, డాక్టర్ అనిల్, హైదరాబాద్ కామినేని హాస్పిటల్, ఆమనగల్లు లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 207 మంది రోగులకు బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, జలుబు, దగ్గు, గొంతు నొప్పి, వైరల్ ఫీవర్, తదితర తాత్కాలిక వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేశారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకర్, మాజీ ఎంపీటీసీ రఘు, మల్లేశ్, స్వామిగౌడ్, గౌడసంఘం తాలూకా కన్వీనర్ అశోక్‌గౌడ్, బుచ్చిబాబు, అఖిల్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సేవా పథక దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథక దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఎస్ సురేష్, ప్రోగ్రాం ఇన్‌చార్జి రాకేశ్ భవానీతో పాటు డాక్టర్ రచనలు మాట్లాడారు. ప్రతిజక్కరూ స్వచ్ఛతను పాటిస్తూ సమాజ సేవలో భాగస్వాములు కావాలన్నారు.

డ్రైనేజీకి మరమ్మతులు చేపట్టండి



డ్రైనేజీని పరిశీలిస్తున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్

కడ్తాల్: తలకొండపల్లి కూడలిలో డ్రైనేజీ పైకప్పుకు మరమ్మతులు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికులతో కలిసి తలకొండపల్లి కూడలిలో కూలిన డ్రైనేజీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డ్రైనేజీ లైన్ మీదుగానే షాద్‌నగర్, తలకొండపల్లి తదితర ప్రాంతాలకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. రాత్రి వేళల్లో ఏదైన ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రశ్నించారు. డ్రైనేజీ కుంగి మూడూ నెలలు గడిచినా మరమ్మతులు చేపట్టకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

వినతి పత్రం అందజేత

డ్రైనేజీ మరమ్మతులు చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు రాఘవేందర్ వినతి పత్రం అందజేశారు. సంబంధిత అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదని, సత్వరమే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

ఆరోగ్య రక్షణకు వైద్య పరీక్షలు తప్పనిసరి

- పంచాయతీల సిబ్బందిని ఐదు క్లస్టర్లుగా ఏర్పాటు
- కుటుంబ సభ్యులకు కూడా పరీక్షలు
- యాచారం సీహెచ్‌సీలో వైద్య సేవలు



తమ్మలోనిగూడ పారిశుద్ధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

యాచారం: అసలే అరకొర జీతాలు.. ప్రాణాలకు తెగించి పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న సిబ్బంది ఆరోగ్యంపై కలెక్టర్ శశాంక ప్రత్యేక దృష్టి పెట్టారు. పంచాయతీల సిబ్బందిని ఐదు క్లస్టర్లుగా ఏర్పాటు చేయించి ఆరోగ్య రక్షణకు వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచిస్తున్నారు. పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నమవుతున్న సిబ్బంది కొన్ని సార్లు అనారోగ్యం పాలయ్యే అవకాశాలు లేకపోలేదు. కొందరు మృత్యువాతకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఈ క్రమంలో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా అన్ని గ్రామాల్లోని పారిశుద్ధ్య సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు పరీక్షలు నిర్వహించి, సరైన వైద్యం అందించాలని కలెక్టర్ పంచాయతీ రాజ్, వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఎవరికైనా అత్యవసర శస్త్రచికిత్సలు అవసరమయ్యే వారి నివేదికలు పంపించాలన్నారు. ఈ విషయాన్ని సర్కార్ దృష్టికి తీసుకెళ్లి ఉచితంగా వైద్య పరీక్షలు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వైద్య పరీక్షలో భాగంగా మొదటి రోజు యాచారం మండల పరిధిలోని మాల్, మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి, తమ్మలోనిగూడ, కేసీ తండాల్లోని పారిశుద్ధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

మిగితా గ్రామాల్లో..

ఈ నెల 26న గునగల్, గడ్డమల్లయ్యగూడ, చింతుల్ల, ధర్మన్నగూడ, అక్టోబర్–1న యాచారం, తక్కళ్లపల్లితండా, చౌదర్‌పల్లి, చింతపట్ల, మొండిగౌరెల్లి, అక్టోబర్–3న కొత్తపల్లి, మల్కీజ్‌గూడ, నక్కర్త మేడిపల్లి, నానక్‌నగర్, తక్కళ్లపల్లి, అక్టోబర్–6న అయ్యవారిగూడెం, కుర్మిద్ద, నందివనపర్తి, నస్దిక్ సింగారం, తాడిపర్తి గ్రామాల్లోని పారిశుద్ధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

మంచి అవకాశం



పారిశుద్ధ్య సిబ్బందికి ఇది మంచి అవకాశం. కలెక్టర్ ఆదేశాల మేరకు పారిశుద్ధ్య సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు కూడా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. అవసరమున్న వారికి మందులు ఉచితంగా పంపిణీ చేస్తారు. అత్యవసర చికిత్సలు ఏమైనా అవసరం అనుకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారి పేర్లతో కూడిన నివేదికను పంపిస్తాం.

–నరేందర్‌రెడ్డి, ఎంపీడీవో, యాచారం

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిరేఖ



ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ శాంతిరేఖ

ఆమనగల్లు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిరేఖ పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతిరేఖ మాట్లాడుతూ చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, తాజాపండ్లలో పోషకాలు లభిస్తాయని, వాటిని ప్రతిరోజూ ఆహారంలో తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని ఆమె సూచించారు. తల్లిదండ్రులు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనిత, ఉమ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు ప్రశంసనీయం



వీల్స్ ఆన్ మీల్స్ అన్నదానం ప్రారంభించిన సీఐ శివప్రసాద్, తహసీల్దార్ షేక్ ముంతాజ్ తదితరులు

సీఐ శివప్రసాద్

కడ్తాల్: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని సీఐ శివప్రసాద్ పేర్కొన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్ తండ్రి సీత్యానాయక్ వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన 'వీల్స్ ఆన్ మీల్స్' అన్నదాన శిబిరాన్ని మంగళవారం తహసీల్దార్ షేక్ ముంతాజ్‌తో కలిసి సీఐ శివప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు అందజేస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు. ప్రయాణికులకు ఉచితంగా ఆహారం అందించడం అభినందనీయమని క్లబ్ నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఎస్ఐ వరప్రసాద్, క్లబ్ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మాజీ సర్పంచ్‌లు వేణుగోపాల్, లక్ష్మీనర్సింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాంచందర్‌నాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, లయన్స్‌క్లబ్ సభ్యులు రాజేందర్ యాదవ్, గంప శ్రీనివాస్, అంజయ్యగుప్తా, మహేశ్, నర్సింహ, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, శంకర్, జగన్, చంద్రు, బలరాం, రంగా, పీఆర్‌ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనాలు నిర్మించాలని వినతి

మాడ్గుల: మాడ్గుల మండలంలో శిథిలావస్థలో చేరిన తహసీల్దార్ కార్యాలయ, మండల ప్రజా పరిషత్ కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మించాలని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ విషయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ ప్రభాకర్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ డైరెక్టర్ కొప్పు జగన్ గౌడ్, సీనియర్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, యాదయ్య గౌడ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

పోచమ్మతల్లి ఆలయ చైర్మన్ సత్యంయాదవ్

కడ్తాల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని స్థానిక పోచమ్మ తల్లి ఆలయ చైర్మన్ సత్యంయాదవ్ పేర్కొన్నారు. ఇటీవల మండల కేంద్రంలో బోనాల ఉత్సవాలను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని పోచమ్మ తల్లి ఆలయం వద్ద మంగళవారం ఆలయ చైర్మన్ సత్యంయాదవ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. స్థానిక నాయకులు, భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, అభిషేకంతో పాటు, మారు నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వేణుగోపాల్, లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, భాస్కర్ రెడ్డి, రాంచందర్‌నాయక్, రాములు, శ్రీశైలం, మల్లేశ్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, వెంకటేశ్‌గుప్తా, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం 51వ మహాజన సభ మంగళవారం స్థానిక రొక్కం సత్తిరెడ్డి గార్డెన్స్‌లో సంఘం చైర్మన్, డీసీసీబీ చైర్మన్, టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తుర్కయంజాల్ రైతు సహకార సంఘం లాభాల బాటలో పయనిస్తూ, రాష్ట్రంలోని మిగతా సంఘాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఎన్నికల హామీలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ చేసిందని గుర్తు చేశారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సంఘం రూ. 4.20 కోట్ల లాభం గడించిందని, 3,672 మంది రైతులకు డివిడెండ్ కింద రూ. 21,62,578 చెల్లించినట్లు చైర్మన్ సత్తయ్య పేర్కొన్నారు. అనంతరం 325 మంది రైతులకు సబ్సిడీతో మందులను పిచికారి చేసే యంత్రాలు, టార్పలిన్ కవర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, మాజీ జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు, సంఘం డైరెక్టర్ వంగేటి లక్ష్మారెడ్డి, సీఈఓ వై రాందాసు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి



మహాధర్నా పోస్టర్ ఆవిష్కరించిన ఆర్ కృష్ణయ్య, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య
- మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

ఆమనగల్లు: ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలో ఈ నెల 28న బీసీ మహాసభ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో బీసీ మహాధర్నా పోస్టర్లను బీసీసంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీసీ నాయకులు దూదిమెట్ల బాలరాజ్‌యాదవ్, తుల ఉమ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొమ్ము శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడారు. కల్వకుర్తిలో నిర్వహించనున్న మహాధర్నా తెలంగాణ రాష్ట్రంలో చేపట్టనున్న బీసీ ఉద్యమానికి దిక్సూచిగా నిలవాలన్నారు. కామారెడ్డిలో కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఆ రోడ్డు బురదమయం!

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు
- గుంతలుగా మారిన ఆదర్శ బడి రోడ్డు
- పట్టించుకోని అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డువెంట నడవాలంటే విద్యార్థుల దుస్తులపై బురదపడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ రోడ్డు వెంట నడవాలంటే నరకయాతన తప్పడం లేదని చెబుతున్నారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని బొంగ్లూర్ ఆదర్శ పాఠశాలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై బురదచేరి గుంతలుగా మారింది. ఔటర్‌రింగ్‌రోడ్డు నుంచి పాఠశాల వరకు సీసీ రోడ్డు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. అరకిలో మీటర్ మేర కాలినడకన బురదలో వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని, చెప్పులు, బట్టలు బురదమయంగా మారుతున్నాయని చెబుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకొని ఆదర్శ బడి రోడ్డును బాగు చేయించాలని కోరుతున్నారు.



బురదమయంగా మారిన ఆదర్శ పాఠశాల రోడ్డు

దుర్వాసన భరించలేం

- మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన
- హాస్టల్ పరిసరాలను పరిశీలించిన చైర్మన్, కమిషనర్



హాస్టల్ పరిసరాలను పరిశీలిస్తున్న చైర్మన్ రాంపాల్‌నాయక్, కమిషనర్ వసంత

ఆమనగల్లు: పాత బీసీ హాస్టల్ భవన ఆవరణలో చెత్తాచెదారం వేయడంతో పాటు చేపల వ్యర్థాలను వేస్తుండడంతో దుర్వాసనను భరించలేకపోతున్నామని శ్రీనివాస కాలనీ, సాయినగర్ కాలనీ వాసులు ఆందోళన వ్యక్తంచేశారు. హాస్టల్ భవన సమీపంలో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించి తమ ఆరోగ్యాలను కాపాడాలని కాలనీవాసులు కోరారు. మాడ్గుల రోడ్డులోని బీసీ హాస్టల్‌లో విద్యార్థులు లేకపోవడంతో ఆరేళ్లక్రితం హాస్టల్‌ను మూసివేశారు. అప్పటినుంచి హాస్టల్ భవనం నిరూపయోగంగా ఉంది. హాస్టల్ ప్రహరీని కొందరు కూల్చివేయడంతో అక్కడే చెత్తాచెదారం వేస్తున్నారు. దీనికి తోడు హాస్టల్ ఎదుట చేపల విక్రయాలు చేస్తున్నారు. అక్కడ వెలువడే చేపల వ్యర్థాలను హాస్టల్ పరిసరాల్లో పడేస్తున్నారు. దీంతో అక్కడి పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారుతూ దుర్వాసన వెదజల్లుతుంది. అంతేకాకుండా జనం కూడా అక్కడే మలమూత్ర విసర్జన చేయడంతో దుర్వాసన ఎక్కువవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ సమీపంలోని ఇళ్లలో ప్రజలు దుర్వాసన భరించలేకపోతున్నామని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. దీంతో పాత హాస్టల్ భవన పరిసరాలను మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కమిషనర్ వసంత కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. హాస్టల్ పరిసరాల్లో పేరుకపోయిన చెత్తాచెదారాన్ని రెండు రోజుల్లో తొలగించి, హాస్టల్ చుట్టూ కంచె ఏర్పాటు చేయిస్తామని వారు హామీ ఇచ్చారు. చేపల విక్రయదారులు వ్యర్థాలను హాస్టల్ పరిసరాల్లో వేస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చినుకు పడితే చీకటే..!

చుక్కాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా

తలకొండపల్లి: చినుకు పడితే గ్రామం అంధాకారంగా మారుతోందని, కారు చీకట్లోనే ఉండాల్సి వస్తోందని చుక్కాపూర్ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం చుక్కాపూర్ గ్రామస్థులు విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. విద్యుత సబ్‌స్టేషన్ ఆవరణలో బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ దాసరి యాదయ్య మాట్లాడుతూ చినుకు పడితే చాలు గ్రామంలో విద్యుత్ సరాఫరా నిలిచిపోతోందని తెలిపారు. ఈ విషయంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా విద్యుత్ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తమ సమస్య పరిష్కరించాలని ఏడీ శ్రీనివాసులు, ఏఈ కఠారియాకు వినతిపత్రం అందజేశారు.



సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్థులు

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం



ఇబ్రహీంపట్నం రూరల్: బొంగ్లూర్ రోడ్డులో ఊడ్చుతున్న మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, వైస్ చైర్మన్ యాదగిరి తదితరులు



ఆమనగల్లు: ర్యాలీ నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

- ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి

ఆమనగల్లు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని కోరుతూ ఆమనగల్లు పట్టణంలో మున్సిపల్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్యలతో కలిసి కమిషనర్ వసంత ర్యాలీ ప్రారంభించారు.

ఇబ్రహీంపట్నం రూరల్‌లో..

ఇబ్రహీంపట్నం రూరల్: పరిసరాల పరిశుభ్రతే లక్ష్యమని ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని బొంగ్లూర్ ఔటర్‌రింగ్‌రోడ్డు వద్ద స్వచ్ఛత హీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ నిరంజన్‌రెడ్డి, వైస్ చైర్మన్ యాదగిరి చీపుర్లు పట్టి రోడ్డును శుభ్రం చేశారు. కమిషనర్ బాలకృష్ణ, ఏఈ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్: బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన చేయొద్దని పుర కమిషనర్ కె అమరేందర్ రెడ్డి సూచించారు. 24వ వార్డులో కమిషనర్ మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన చేస్తే వ్యాధులు ప్రబలే అవకాశం ఉండదన్నారు. అంతకు ముందు విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, ఇఇ హరీశ్ పాల్గొన్నారు.

మాడ్గుల: మండల కేంద్రంలో జిల్లా ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో పద్మావతి స్వచ్ఛతా హీ సేవ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అవగహన ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేసి, ప్రతిజ్ఞ చేయించారు.

కడ్తాల్‌లో...

కడ్తాల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, ఆర్వీ అసోసియేట్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఇంజనీర్ సాయికుమార్ మాట్లాడారు. విద్యార్థులు దైనందిన జీవితంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం రోడ్డు భద్రత, పరిశుభ్రతపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఏఐ అధికారులు గంగాధర్, రత్నకుమార్, శ్రీనివాస్, టీం లీడర్ అమ్రేష్, పాఠశాల హెచ్ఎం జంగయ్య, పీఈటీ భీముడు, ఉపాధ్యాయులు జనార్దన్‌రెడ్డి, శోభారాణి, గీత, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



తుర్కయంజాల్: అవగాహన కార్యక్రమంలో విద్యార్థులతో కమిషనర్ అమరేందర్‌రెడ్డి



మాడ్గుల: ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో పద్మావతి